E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 21-08-2025 (వారం) గురువారం | హైదరాబాద్ పేజీలు–6 | e-kaburu.com



మేజర్ అయిన యువతిని స్టేట్ హోంలో నిర్బంధించలేరు: హైకోర్టు » 3లో

తప్పు సరిదిద్దుకున్న ఐసీసీ.. రీఎంట్రీ ఇచ్చిన రోహిత్, కోహ్లీ » 6లో




టాప్ కంపెనీలో 2,800 ఉద్యోగాలు కట్ 4లో



అది సవాలే కానీ..: కోలీవుడ్‌లో ఎంట్రీపై నోరా ఫతేహి » 5లో



# వెంకన్నా... వట్టిపోతున్న కుంటను నేను....



అదే నీ ఇలాకాలోని ఇరుగంటిపల్లి గ్రామంలో ఉన్న శనగ కుంటను నేను... పుట్టంగండి కాలువకు చివరి దాన్ని... నా కడుపు నిండి ఏడాది దాటింది వెంకన్న. కడుపు ఎండినా పట్టించుకొనే వారు లేరన్న. పొట్టలో నీళ్లు లేవు...పట్టించుకుంటారన్న గ్యారంటీ లేదు. నియోజకవర్గంలోని చెరువులన్నీ గలగలా పారుతున్నాయి... వెలుగుపల్లి, అన్నారం, ముషంపల్లి, మాదారం చెరువుల కడుపు నిండి అలుగు పారుతున్నాయి... నా కింద నుంచే జానన్న తవ్విన వరద కాలువ జోరుగా పారుతుంది... చుట్టూ నీళ్ళున్నా నా గొంతే ఎండుతోంది ఎట్లా వెంకన్నా... నా బతుకెందో నాకే అర్థం కావడం లేదు. నా చుట్టూ ఉన్న నలుగురు రైతుల పంటలకు నీళ్లు ఇవ్వలేను, నా గర్భంలో దాగిన చేపలను సాధలేను, నన్నే నమ్ముకొని వచ్చే పక్షులకు సైతం నీడనివ్వలేని బతుకు బతుకేనా.. నేను నిజంగా చెరువునేనా అనే అనుమానం నాకే కలుగుతుంది వెంకన్నా... ఆకాశం నిండా మబ్బులున్నా వరుణుడు కరుణించకపాయే... నా వాళ్ళే నా ఉనికి లేకుండా చేస్తున్న ప్రయత్నానికి తోడు కృష్ణమ్మ నీటి బొట్టు ధరీ చేరకుండా చేస్తుండడం నాకు శాపమే కదా వెంకన్నా... ఊరూరా కాలువలు తీసి, ఆశలు రేపితిరి.. నా వరకు ఏ కాలువ తీయకుండా మొఖం చాటేస్తిరి... ఇక నేను బతికేదెట్లా వెంకన్నా. నా వైపు నీళ్లంటే ఇరిగేషన్ ఇంజనీర్ సార్లు కస్సు బుస్సు అనబట్టే.. ఇక నాకు దిక్కెవరు ఎంకన్నా. నీళ్లు వదిలే ఇంజనీర్లు ఇటువైపు కాలువలో నీళ్ళు రాకుండా కాంక్రీట్ పోస్తిరి. వాళ్ళు బాధ్యత మరిచి నన్ను ఒక చెరువుగానే గుర్తించరేమి ఎంకన్నా. నేను చెరువును కాదా, మా వాళ్ళూ ప్రజలు కారా వెంకన్న. అన్ని చెరువులు నిండినా నాకు కనుచూపు మేరలో గంగమ్మ జాడ కనిపించడం లేదు వెంకన్నా. ఇప్పటికైనా నా మీద కనికరం కలుగదా వెంకన్నా... మీరు ఇటువైపు వచ్చినప్పుడు సైరన్ చప్పుడు వింటూనే ఉంటాను. మంత్రి అయ్యావని సంతోషిస్తిని.... ఒక్కసారి వచ్చి నన్ను చూడు వెంకన్న నా గోసలు ఎడబాపు ఎంకన్నా ... నేను చెరువునా కాదా వెంకన్న. నన్ను చెరువుగా గుర్తిస్తావా వెంకన్న.

**మీ ఆపన్న హస్తం అందిస్తావని ఆశగా ఎదిరి చూస్తూ...**

ఇట్లు...
శనగకుంట, ఇరుగంటిపల్లి,
కనగల్ మండలం, నల్గొండ జిల్లా

**ఈకబురు, తెలంగాణ**

## అమెరికా సిలికాన్ వ్యాలీని శాసించే స్థాయిలో ఉన్నాం...

తెలంగాణ సమగ్ర అభివృద్ధికి 2047 ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం

పాతబస్తీ ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

గచ్చిబౌలిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపన



ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి, మంత్రులు

ఈకబురు, శేరిలింగంపల్లి :నేడు అమెరికాలోని సిలికాన్ వ్యాలీని శాసించే స్థాయిలో మనం ఉన్నామని, అక్కడ పనిచేస్తున్న మనవాళ్లు పనిచేయడం మానేస్తే అమెరికా ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే స్థాయికి వచ్చామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. ప్రపంచమంతా 2034 నాటికి హైదరాబాద్ నగరాన్ని చూసేందుకు తరలిరావాలని, ఆ స్థాయిలో నగరాన్ని అభివృద్ధి చేసేందుకు అడుగులు వేస్తున్నామన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 పాణాళికను సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

తరువాయి 2లో

# పదవీచ్యుతి బిల్లులపై గగ్గోలు

- అరెస్టైన పీఎం, సీఎం, మంత్రులను తొలగించే బిల్లులపై నిరసన
- లోక్‌సభలో 3 బిల్లుల్ని ప్రవేశపెట్టిన అమిత్‌షా
- మూజువాణి ఓటుతో జేపీసీకి నివేదన
- అవి దుర్మార్గం, క్రూరమంటూ ప్రతిపక్షాల ధ్వజం
- రాజ్యాంగం, సమాఖ్యపై దాడి అని ఆందోళన
- బిల్లు ప్రతుల్ని చింపి షాపైకి విసిరిన సభ్యులు
- షావైపు దూసుకెళ్లే యత్నం.. అడ్డుకున్న మార్షల్స్
- గుజరాత్ హోంమంత్రిగా అరెస్టైన అమిత్‌షా విలువలపై మాట్లాడటమేంటి?: వేణుగోపాల్
- నేను అరెస్టుకు ముందే రాజీనామా చేశా: షా
- మధ్యయుగాల నాటికి దేశం తిరోగమనం
- రాజ్యాంగంపై దాడి చేస్తున్నవారికి, రక్షిస్తున్న వారికి మధ్య జరుగుతున్న యుద్ధం ఇది: రాహుల్
- ఇది ప్రజాస్వామ్యంపై దాడి: వామపక్షాలు
- అవినీతిని కాపాడుకునేందుకే ప్రతిపక్షాల ప్రయత్నం.. బీజేపీ ప్రత్యారోపణ
- 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'కు ఆమోదం




తీవ్ర నేరారోపణలతో అరెస్టయితే ప్రధాని, సీఎంలు, కేంద్ర, రాష్ట్రాల మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లులపై లోక్‌సభ అట్టుడికింది. దీనికి సంబంధించిన మూడు బిల్లులను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బుధవారం మధ్యాహ్నం లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

తరువాయి 2లో

## దేశంలో 64 శాతం ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్టీలు నాకు మద్దతునిస్తున్నాయి

- » అర్హుడినే ఎన్నుకోవాలని ఎన్డీఏనూ కోరుతున్నా
- » రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యత నిర్వర్తించా
- » కొత్త ఓటర్లను చేర్చుకోవాల్సిన ఎన్నికల కమిషన్
- » ప్రస్తుతం ఉన్న ఓటర్లను తొలగిస్తోంది



న్యూఢిల్లీ, ఈ కబురు: ఉపరాష్ట్రపతి పదవి రాజకీయాలకు అతీతమైనదని, రాజ్యాంగాన్ని పరిరక్షించే పదవి అని ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. గతంలో వెంకయ్యనాయుడు బీజేపీకి రాజీనామా చేసిన తర్వాతే ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేశారని గుర్తు చేశారు. తాను ఏ పార్టీ వాడినీ కాదని, రాజ్యాంగంతో సుదీర్ఘమైన ప్రస్థానం ఉన్న తనకు అన్ని పార్టీలు మద్దతిస్తాయన్న ఆశాభావంతో ఉన్నానని తెలిపారు. గతంలో బీజేపీ ముఖ్యమంత్రిగా ఉన్న మనోహర్ పారికర్ కూడా తనను లోకాయుక్తగా నియమించారని గుర్తు చేశారు. అర్హులైన వ్యక్తిని ఎంచుకోవాలని ఎన్డీఏ పార్టీలను కూడా కోరుతున్నట్లు పేర్కొన్నారు. న్యాయమూర్తిగా ఐదున్నర దశాబ్దాలు రాజ్యాంగాన్ని పరిరక్షించే బాఉధ్యతనే నిర్వర్తించానని, ఇప్పుడు కూడా అదే బాఉధ్యత స్వీకరించేందుకు ముందుకొచ్చానని చెప్పారు. రాజ్యాంగమంటేనే సామాజిక న్యాయమని, రాజ్యాంగ పీఠికలో తొలి పదం సామాజిక న్యాయమని పేర్కొన్నారని చెప్పారు.

తరువాయి 2లో

## సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు



- న్యూఢిల్లీ, ఈ కబురు : ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ఎన్డీఏ అభ్యర్థి అయిన సీపీ రాధాకృష్ణన్ బుధవారం తన నామినేషన్ దాఖలు చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ కార్యదర్శి జనరల్ పీసీ మోడీకి రాధాకృష్ణన్ తరపున ప్రధాని మోదీ నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు.

తరువాయి 3లో



## భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక

- 48 అడుగులకు చేరిననీటిమట్టం
- గంటగంటకూ గోదారికి పెరుగుతున్న వరద ఉధృతి

ఈ కబురు, హైదరాబాద్ : గోదావరి నదికి వరద పోటెత్తుతోంది. గతవారం రోజులుగా కురిసిన భారీ వర్షా లతో ఉపనదులైన సింగూరు, పెన్‌గంగా, వార్ధా, ప్రాణహిత, ఇంద్రావతి, తాళిపేరు, కిన్నెరసాని పరవళ్లు తొక్కుతుండడంతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరనుందని అంచనాలతో కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) యెల్లో హెచ్చరిక జారీ చేసింది. రాత్రి 10:05 గంటలకు భద్రాచల వద్ద నీటిమట్టం 48 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

తరువాయి 2లో

థర్డ్‌క్లాస్ సీఎం పెట్టిన అభ్యర్థిని సమర్థించే ప్రసక్తే లేదు!



తరువాయి 3లో

## ఢిల్లీ సీఎంపై దాడి

- ముఖ్యమంత్రి ప్రజాదర్బార్‌లో ఘటన
- రేఖ చెయ్యి, భుజం, తలకు గాయాలు
- సకారియాపై హత్యాయత్నం కేసు నమోదు
- దాడిని ఖండించిన రాజకీయ పక్షాలు
- వీధి కుక్కలపై సుప్రీం తీర్పు మీద నిరసన తెలిపేందుకే ఢిల్లీ వెళ్లాడు: సకారియా తల్లి



తరువాయి 2లో

మొదటి పేజీ తరువాయి

# అమెరికా సిలికాన్ వ్యాలీని శాసించే స్థాయిలో ఉన్నాం...




సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

గచ్చిబౌలిలోని తాలిమ్ ఆవరణలో 3 ఎకరాల పైచీలుకు విస్తీర్ణంలో, 50వేల చదరపు అడుగులతో నూతనంగా చేపట్టనున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఐటి శాఖమంత్రి డి. శ్రీధర్ బాబులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలంటే నగర అభివృద్ధితో పాటు నగర విస్తరణ జరుగాలన్నారు. హైదరాబాద్ నగరం విస్తరించాలంటే ట్రిపుల్ ఆర్, ఎలివేటెడ్ కారెడార్లు అందుబాటులోకి రావాలని, మెట్రో విస్తరణ చేపట్టాలని, మూసీ సుందరీకరణ చేపట్టి, పరివాహకంలో నైట్ మార్కెట్ ను అభివృద్ధి చేయాలన్నారు. దీంతో పాటు నగరంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని తెలిపారు. నగరం ఎంత అభివృద్ధి చెందుతున్నా ప్రభుత్వ కార్యాలయాల రూపురేఖలు మారడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం 15వేల కోట్ల ఆధాయాన్ని ఆర్జించి పెట్టే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు సమస్యలకు నెలవుగా మారాయన్నారు, దీన్ని దృష్టిలో ఉంచుకొని ఔటర్ రింగురోడ్డు లోపల కోర్ అర్బన్ రీజియన్ లో ఉన్న 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఇంటిగ్రేటెడ్ భవనాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అందులో భాగంగా గచ్చిబౌలిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపన చేస్తున్నామని, ప్రభుత్వానికి పైసా ఖర్చు లేకుండా ఈ భవనాలను అపర్ణా సంస్థ సామాజిక బాధ్యతగా 30కోట్ల నిధులతో నిర్మిస్తుందన్నారు. అత్యాధునిక హంగులు, సౌకర్యాలతో చేపట్టే ఈ భవనాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి రానున్న జూన్ 2వ తేదీన ప్రారంభించుకోవాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ నగరం చారిత్రాత్మక నగరమని, అంతర్జాతీయ స్థాయిలో నగరం గుర్తింపు పొందేందుకు ఆనాటి కులీకుతుబ్ షాహీ నుంచి గత ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, వైఎస్ఆర్ లు ఎంతో కృషి చేశారన్నారు. వీరి కృషి కారణంగానే నేడు ప్రపంచంలోని 500 పార్చున్ కంపెనీల్లో 85 కంపెనీలు నగరంలో తమ కార్యకలాపాలు సాగిస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ నగరానికి బెంగళూరు, చెన్నై వంటి నగరాలతో పోటీ కాదని, టోక్యో, న్యూయార్క్ వంటి నగరాలతో పోటీ పడుతుందన్నారు. ఐటిలో ఎంతగా అభివృద్ధి చెందుతున్నా నేటికి నగరంలో మౌలిక సదుపాయాల సమస్యలు ఉన్నాయని, చెత్త పేరుకుపోయి, చినుకు పడిందంటే నీళ్లు నిలిచిపోతున్నాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని మూసి ప్రక్షాళన, సుందరీకరణ, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైందని, కానీ కొంతమందికి ఇది ఇష్టం లేదన్నారు. నాడు హైటెక్ సిటీ నిర్మాణాన్ని సైతం కొంతమంది అవహేళన చేశారన్నారు. మూసి ప్రక్షాళనతో ఓల్డ్ సిటీని గోల్డ్ సిటీగా మారుస్తామని, ఓల్డ్ సిటీ ఒరిజినల్ సిటీ అని అన్నారు. నగరానికి 20టిఎంసీల గోదావరి జలాలను తీసుకువచ్చి, 365 రోజులు నీరుండేలా రివర్ ఫ్రంట్ ను అభివృద్ధి చేస్తామన్నారు. గచ్చిబౌలి స్టేడియం నాడు ఆఫ్రో ఏషియన్ గేమ్స్, మిలటరీ గేమ్స్ కు వేదికగా మారితే, మధ్యలో ఈ అంతర్జాతీయ స్టేడియం పెళ్లిళ్లు, పేరంటాలకు వేదికగా నిలిచిందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణారావు, శాసనమండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి. స్పెషల్ సెక్రెటరీ రాజీవ్ గాంధీ హనుమంతు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డిలతో పాటు పలువురు అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఢిల్లీ సీఎంపై దాడి



న్యూఢిల్లీ, ఈ కబురు: ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా ప్రతివారం నిర్వహించే 'జన్ సున్‌వాయి' (ప్రజాదర్బార్) కార్యక్రమంలో ఒక వ్యక్తి ఆమెపై దాడికి పాల్పడ్డాడు. బుధవారం ఉదయం సివిల్ లైన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒక్కొక్కరు వచ్చి ఆమెకు తమ సమస్యలను విన్నవించుకుంటున్నారు. 8.15 గంటలకు ఓ వ్యక్తి తన వద్దనున్న కాగితాలను రేఖా గుప్తాకు అందించారు. వెంటనే అరుస్తూ ఆమెపై దాడి చేశాడు. చెయ్యి పట్టుకొని లాగి చెంపపై కొట్టాడు. తర్వాత జుట్టు పట్టుకొని లాగాడు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే అతన్ని అదుపులోకి తీసుకున్నారు. దాడి చేసిన వ్యక్తిని గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన రాజేశ్ భాయ్ ఖిమ్జి భాయ్ సకారియా (41)గా గుర్తించారు. తన బంధువు జైల్లో ఉన్నారని, విడిపించాంటూ పిటిషన్ ఇచ్చేందుకు వచ్చానని సకారియా చెప్పినట్టు తెలిసింది. సీఎంకు ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. కాగా, ఇది పక్కా ప్రణాళికతో జరిగిన దాడి అని సీఎం కార్యాలయం(సీఎంవో) ఓ ప్రకటనలో తెలిపింది. ఆమెను చంపే కుట్రగా అభివర్ణించింది. నిందితుడిపై హత్యాయత్నం సహా పలు అభియోగాలతో ఐదు క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు సీనియర్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. ఘటనను ఆప్ నేత అర్వింద్ కేజ్రీవాల్ ఖండించారు. కాగా, వీధి కుక్కలపై సుప్రీం తీర్పుపై నిరసన తెలిపేందుకు తన కొడుకు సకారియా ఢిల్లీ వెళ్లినట్లు అతడి తల్లి భానుబెన్ రాజ్‌కోట్‌లో విలేకరులకు తెలిపారు. సకారియాకు కుక్కలంటే ఎంతో ఇష్టమన్నారు.



మొదటి పేజీ తరువాయి

# పదవీచ్యుతి బిల్లులపై గగ్గోలు



న్యూఢిల్లీ, ఈ కబురు: తీవ్ర నేరారోపణలతో అరెస్టయితే ప్రధాని, సీఎంలు, కేంద్ర, రాష్ట్రాల మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లులపై లోక్‌సభ అట్టుడికింది. దీనికి సంబంధించిన మూడు బిల్లులను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బుధవారం మధ్యాహ్నం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. వెంటనే ఆ బిల్లులు దుర్మార్గం, క్రూరమైనవంటూ ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో నిరసనకు దిగాయి. సభా కార్యకలాపాలను స్తంభింపజేశాయి. కొందరు ఎంపీలు బిల్లు ప్రతులను చింపి అమిత్‌షా వైపు విసిరారు. మరోవైపు బిల్లులకు మద్దతుగా ప్రతిపక్షాలను తప్పుపడుతూ అధికారపక్ష సభ్యులు నినాదాలకు దిగారు. దీనితో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. కొందరు ప్రతిపక్ష సభ్యులు అమిత్‌షాను ఘెరావ్ చేసేందుకు దూసుకురాగా.. కేంద్ర మంత్రులు రవ్‌నీత్‌సింగ్ బిట్టూ, కిరణ్ రిజిజు అడ్డుగా నిలిచారు. వెంటనే మార్షల్స్ కూడా వచ్చి అమిత్‌షాకు రక్షణ వలయం ఏర్పాటుచేశారు. ఈ గందరగోళం మధ్య మూడు బిల్లులను మూజువాణి ఓటుతో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి అప్పగిస్తున్నట్టుగా స్పీకర్ ప్రకటించారు. పార్లమెంటు తర్వాతి సమావేశాల్లో తొలివారం చివరిరోజున దీనిపై నివేదికను సమర్పించాలని సూచించారు. తర్వాత కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగడంతో సభను వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. కాగా, పార్లమెంటు శీతాకాల సమావేశాలు నవంబర్ మూడో వారంలో ప్రారంభంకావొచ్చని అంచనా. అప్పటికల్లా జేపీసీ నివేదికను సిద్ధం చేయాల్సి ఉంటుంది. జేపీసీలో 21 మంది లోక్‌సభ సభ్యులు, 10 మంది రాజ్యసభ సభ్యులు ఉంటారు. ఐదేళ్లకుపైగా శిక్షపడే కేసుల్లో అరెస్టయి 30రోజులకు పైగా జైలులో ఉండే ప్రధాని, సీఎంలు, కేంద్ర, రాష్ట్రాల మంత్రులను.. 31వ రోజున ఆటోమేటిగ్గా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించేలా మూడు బిల్లులను కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రూపొందించింది. మూడు బిల్లులు ఒకే అంశానికి చెందినవే అయినా.. రాజ్యాంగంలోని విభిన్నమైన ఆర్టికల్‌స్‌ను సవరించేందుకు వీలుగా కేంద్రం, రాష్ట్రాలకు సంబంధించి 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించి మరో బిల్లు, జమ్మూకశ్మీర్‌కు సంబంధించి మూడో బిల్లు సిద్ధం చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లులు రాజ్యాంగానికి, సమాఖ్య వ్యవస్థకు విరుద్ధమని ప్రతిపక్షాల నేతలు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకే కేంద్రం ఈ బిల్లులను తీసుకొచ్చిందని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. సాధారణంగా నేరం రుజువయ్యే వరకు ఎవరైనా నిర్దోషులేనని, కానీ కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లులు ఈ సహజ న్యాయానికి విరుద్ధంగా ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ పేర్కొన్నారు. కీలకమైన బిల్లు ప్రతులను సభ్యులకు అందజేయకుండా హడావుడిగా లోక్‌సభలో ప్రవేశపెట్టాల్సిన అవసరం ఏమిటని ఆర్ఎస్పీ ఎంపీ ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ నిలదీశారు. పార్లమెంటు సమావేశాలు ముగిసే ముందు హడావుడిగా బిల్లులను ప్రవేశపెట్టడం ఏమిటని కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. గతంలో గుజరాత్ రాష్ట్ర హోంమంత్రిగా ఉన్నప్పుడు అరెస్టయిన అమిత్‌షా.. ఇప్పుడు రాజకీయాల్లో నైతికతపై మాట్లాడుతూ, బిల్లులు ప్రవేశపెట్టడం ఏమిటని విమర్శించారు.

**ఇది ప్రజాస్వామ్యంపై దాడి: వామపక్షాలు**


పదవుల నుంచి తొలగింపు బిల్లులు దేశ ప్రజాస్వామ్యం, సమాఖ్య వ్యవస్థలకు గొడ్డలిపెట్టు అని వామపక్షాలు మండిపడ్డాయి. "ప్రజాస్వామ్యంపై జరుగుతున్న ఈ దాడిని అడ్డుకునేందుకు అందరూ కలిసి రావాలి" అని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ప్రజలు ఎన్నుకున్న సీఎం, మంత్రులను తొలగించడమంటే.. రాష్ట్రాలను ఎవరు పాలించాలనేదానిపై కేంద్రం పెత్తనమేనని, ఇది సమాఖ్య విధానానికి విరుద్ధమని సీపీఐ ఎంపీ సందోష్‌కుమార్ విమర్శించారు. కాగా, బీజేపీ ఓట్ల చోరీ నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు చేసే ప్రయత్నమని తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ విమర్శించారు. తమ అవినీతిని, అవినీతి నేతలను కాపాడుకునేందుకే ప్రతిపక్షాలు కేంద్రం తెచ్చిన మూడు బిల్లులను తప్పుపడుతున్నాయని బీజేపీ మండిపడింది.

**'పదవుల తొలగింపు' బిల్లులేంటి?**

ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం.. రెండేళ్లు, అంతకంటే ఎక్కువ శిక్షపడిన ప్రజాప్రతినిధులను పదవుల నుంచి తొలగించవచ్చు. కేసులు నమోదవడం, జైలులో ఉండటం వల్ల పదవుల నుంచి తప్పుకోవాలన్న నిబంధన ఏదీ లేదు. ఢిల్లీ సీఎంగా ఉన్నప్పుడు కేజ్రీవాల్ లిక్కర్ స్కాం కేసులో అరెస్టయి జైలుకు వెళ్లారు. జైలులో ఉన్న 6నెలల పాటు కూడా ఆయన సీఎంగానే కొనసాగారు. ఇటీవల తమిళనాడు మంత్రిగా ఉన్న సెంథిల్ బాలాజీ అరెస్టయి జైలులో ఉన్నా పదవిలో కొనసాగారు. సుప్రీంకోర్టు తప్పుబట్టడంతో పదవి నుంచి తప్పుకొన్నారు. ఈ క్రమంలోనే కీలక పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధుల అవినీతిని నిరోధించడానికంటూ కేంద్రం 3బిల్లులు తీసుకొచ్చింది. వీటి ప్రకారం.. కనీసం ఐదేళ్లు, ఆపై శిక్షపడే నేరారోపణలపై అరెస్టయి 30రోజులకుపైగా జైలులో ఉన్న పీఎం, సీఎం, కేంద్ర, రాష్ట్రాల మంత్రులు 31వ రోజున ఆటోమేటిగ్గా పదవి కోల్పోతారు. అయితే జైలు నుంచి విడుదలైన తర్వాత నిబంధనల మేరకు తిరిగి ఆయా పదవులను చేపట్టవచ్చు.

# దేశంలో 64 శాతం ప్రజలకు ప్రాతినిధ్యం

## వహించే పార్టీలు నాకు మద్దతునిస్తున్నాయి



న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అన్న పదాలతో సరిపెట్టకుండా.. అన్ని వర్గాలను కలుపుకొనిపోయే 'సౌహార్ద్ర భావం' అన్న పదం చేర్చారంటే రాజ్యాంగ నిర్మాతలు ఎంత ముందుచూపుతో ఆలోచించారో అర్థమవుతుందన్నారు. "ప్రస్తుత తరుణంలో దేశంలో రాజ్యాంగం పూర్తిగా విధ్వంసం అయిందని చెప్పలేను కానీ, రాజ్యాంగ విలువలు మాత్రం దాదాపు పతనమయ్యాయని చెప్పగలను. ఎన్నికల కమిషన్ సహా అన్ని రాజ్యాంగ వ్యవస్థలూ కుప్పకూలిపోతున్నాయి. వాటిని పరిరక్షించాలంటే రాజ్యాంగ విలువల పట్ల పూర్తి నిబద్ధత, అవగాహన ఉన్న సరైన వ్యక్తులను వ్యవస్థల్లో నియమించాలి. వారిని నిర్ణయ క్రమంలో చేర్చాలి" అని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగం కుప్పకూలిపోతే సంపన్నులకు, మధ్యతరగతికి జరిగే నష్టం తక్కువైనా.. అణగారిన వర్గాలు పూర్తిగా సాధికారత కోల్పోతాయని చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉన్నవారే రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నారని తెలిపారు.

**ఒప్పించే బాధ్యతను రేవంత్‌రెడ్డిపై పెట్టారు..**

ఉపరాష్ట్రపతి అభ్యర్థిత్వంపై తనతో తొలుత కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ మాట్లాడారని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోన్‌చేసి 15 నిమిషాల్లో వస్తున్నానని చెప్పి ఆగమేఘాలపై వచ్చారని చెప్పారు. "మిమ్మల్ని ఒప్పించే బాధ్యతను నాపై పెట్టారు అని రేవంత్ అన్నారు. చివరగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంప్రదించారు. అయితే కాంగ్రెస్ అభ్యర్థిగా మాత్రం నేను పోటీ చేయనని అందరికీ చెప్పాను. ఇండియా కూటమిలోని అన్ని పార్టీలతోపాటు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా మద్దతిస్తుందని, అనేక ఇతర పార్టీలు కూడా మద్దతిస్తున్నాయని చెప్పినందుకే పోటీ చేసేందుకు ఒప్పుకొన్నాను. మిమ్మల్ని ఉపరాష్ట్రపతి పదవికి ఎంచుకోవడం మాకు గౌరవాన్ని కల్పించింది అని యుపీఏ చైర్ పర్సన్ సోనియాగాంధీ అన్నారు" అని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వివరించారు. దేశంలో 64 శాతం మంది ప్రజలకు ప్రాతినిఒధ్యం వహించే పార్టీలు తనను అభ్యర్థిగా నిలబెట్టాలని నిర్ణయించాయని అన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, ఎన్‌సీపీ నేత శరద్ పవార్‌తోపాటు అన్ని పార్టీల నేతలు తనకు మద్దతు ప్రకటించారని చెప్పారు. గెలుపోటములనేది ప్రశ్నే కాదని, ఉపరాష్ట్రపతి పదవికి జరిగే పోటీని సైద్ధాంతిక సమరంగా భావిస్తున్నామని ఖర్గే చెప్పినట్లు తెలిపారు.

**అన్ని పార్టీల పట్ల సమాన దృక్పథం**

రాజకీయ పార్టీల పట్ల సమాన దృక్పథంతో వ్యవహరిస్తూ సభను సజావుగా నడపాలన్నదే తన ధ్యేయమని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో తనకు సత్సంబంధాలున్నాయని, వారు విజ్ఞులు, దూరదృష్టి గలవారని, సమాజం పట్ల పూర్తి అవగాహన ఉన్నవారని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాకు సంబధించి ఎన్నికల కమిషన్ వివాదంలో ఇరుక్కోవడం గురించి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం రాకముందే దేశంలో ఓటర్ల జాబితాను తయారు చేశారని, ఆ బాధ్యతను రాజ్యాంగ సలహాదారైన బీఎన్ రావుకు అప్పజెప్పారని తెలిపారు. ప్రస్తుతం జాబితాలో ఉన్నవారిని తొలగిస్తున్నారని, బీఎన్ రావు మాత్రం శరణార్థులను కూడా ఓటర్ల జాబితాలో చేర్చారని గుర్తు చేశారు. 1928లో అన్ని పార్టీల సదస్సులోనే పేద, ధనిక, వర్గ తారతమ్యాలు లేకుండా అక్షరాస్యతతో నిమిత్రం లేకుండా సార్వత్రిక వయోజన ఓటింగ్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించారని, ఈ మేరకు నెహ్రూ నివేదిక సమర్పించారని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అంతకన్నా పదేళ్ల ముందే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సౌత్‌బరో కమిటీ ముందు దళితులకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించాలని కోరారని వివరించారు. గాంధీజీ కూడా సార్వత్రిక వయోజన ఓటింగ్‌ను సమర్థించారని, ఈ విషయంలో గాంధీ, అంబేడ్కర్ ఏకీభావం వ్యక్తం చేశారని తెలిపారు. దేశ తొలి ఎన్నికల కమిషనర్ సుకోమల్ సేన్ కూడా నెహ్రూ కోరినా ఎన్నికలు జరిపేందుకు ఏడాదిపాటు సమయం తీసుకున్నారని, దేశంలోని మారుమూల ప్రాంతాలకు కూడా వెళ్లి ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు శ్రమించారని వివరించారు ఇంతటి ఘనమైన చరిత్ర ఉన్న ఎన్నికల కమిషన్.. ఇప్పుడు రాజకీయ వివాదాల్లో చిక్కుకోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.

మొదటి పేజీ తరువాయి

# భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక



సింగూరు నుంచి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు వరకు ఎగువ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. మహారాష్ట్రలోని జైక్వాడ్ ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 102.73 టీఎంసీలు కాగా, నీటి నిల్వలు 98.93 టీఎంసీలకు చేరాయి. సింగూరు ప్రాజెక్టులో 18.69 టీఎంసీల నిల్వను కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా, డ్యామ్ భద్రతపై హెచ్చరికల నేపథ్యంలో వరద పెరిగిన కొద్దీ నిల్వలను క్రమంగా తగ్గిస్తున్నారు. నిజాంసాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా, నీటినిల్వలు 15.32 టీఎంసీలకు చేరాయి. గోదావరి ప్రధాన పాయపై ఉన్న శ్రీరాంసాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, 70.42 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తున్నారు. కాళేశ్వరం పుష్కర ఘాటు వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ప్రస్తుతం 104.11 మీటర్ల ఎత్తులో నీటిమట్టం చేరింది. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 3.2లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తింది. జలాశయ నిల్వ సామర్థ్యం 20.18 టీఎంసీలు కాగా 15 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 40 గేట్లను పైకెత్తడం ద్వారా 1.97 లక్షల క్యూసెక్కుల వరదను కిందకు విడుదల చేస్తున్నారు. దిగువన ఉన్న సుందిళ్ల బరాజ్‌కు 4.2 లక్షలు, అన్నారం బరాజ్‌కు 5.04 లక్షలు, మేడిగడ్డ బరాజ్‌కు 10.43 లక్షలు, సమ్మక్కసాగర్‌కు 11.21 లక్షలు, సీతమ్మసాగర్‌కు 10.49 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, వచ్చిందివచ్చినట్టు కిందకు విడుదల చేస్తున్నారు. ఈ బరాజ్‌ల గేట్లన్నింటినీ ఎత్తి ఫ్రీ ఫ్లోలో ఉంచడంతో గోదావరి వరద స్వేచ్ఛగా కడలి దిశగా పరుగెడుతోంది. పెద్దపల్లి జిల్లా పార్వతీ బరాజ్‌కు వరద తాకిడి పెరగడంతో అప్రమత్తమైన అధికారులు.. మొత్తం 74 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. గోదావరి తీరంలోని సిరిపురం, గుంజపడుగు, పోతారం, విలోచవరం, ఉప్పట్ల తదితర గ్రామాల్లోని 200 ఎకరాల్లో వరి, పత్తి పంటలు నీట మునిగాయి. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నీటి ప్రవాహం 16.20 మీటర్లకు చేరింది. 17.33 మీటర్లకు చేరితే అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేస్తారు. వరద ఉధృతికి పరీవాహక ప్రాంతాలైన ఓడవాడ, దళితకాలనీ ప్రాంతాల్లోని ప్రజలను క్రాస్‌రోడ్డులో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రమైన గిరిజన భవన్‌కు తరలించారు. వాజేడు మండలం టేకులగూడెం చివరన 163 నంబరు జాతీయ రహదారిపైకి వరద పెరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

**పోటెత్తిన కృష్ణా**

కృష్ణానదికి కూడా వరద పోటెత్తుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు పది గేట్లను ఎత్తారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 881.8 అడుగుల వద్ద 197.9120 టీఎంసీల నీటి నిల్వ ఉంది. శ్రీశైలం జలాశయం నుంచి 4,85,877 క్యూసెక్కుల నీరు సాగర్‌లోకి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 16 రేడియల్ క్రస్ట్‌గేట్లను 13 అడుగులు, 10 గేట్లను 10 అడుగులు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. నాగార్జునసాగర్ జలాశయ గరిష్ట నీటిమట్టం 590.00 అడుగులు (312.0450టీఎంసీలు). ప్రస్తుతం 583.70 అడుగులు (293.6854 టీఎంసీలు) ఉంది.

# ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు లోక్‌సభ పచ్చజెండా



**లోక్‌సభలో ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును ప్రవేశపెడుతున్న కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్**

దిల్లీ,ఈ కబురు: నగదుతో ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహణ, సహకారం, ప్రాచుర్యం కల్పించడాన్ని నిషేధించే కీలక బిల్లును బుధవారం లోక్‌సభ ఆమోదించింది. 'ది ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు, 2025'ను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ లోక్‌సభలో బుధవారం ప్రవేశపెట్టారు. బిహార్‌లో ఓటర్ల జాబితాల్లో ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాల ఆందోళనల నేపథ్యంలో దీనిపై ఎటువంటి చర్చ జరగకుండానే బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఆన్‌లైన్ ఆటలతో అనేకమంది బాధితులుగా మారుతున్న ఘటనలు పెరిగిపోతుండటం, ఈ వ్యవహారాల్లో నగదు అక్రమ చలామణి, ఆర్థిక అవకతవకలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చింది. ఆన్‌లైన్ గేమ్స్, ఈస్పోర్ట్స్ మధ్య విభజన చూపించేలా బిల్లును రూపొందించారు. ఇది పార్లమెంటు ఆమోదం పొంది చట్టంగా మారితే నిబంధనల్ని ఉల్లంఘించి నగదుతో కూడిన ఆన్‌లైన్ గేమ్స్ అందిస్తున్నవారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష, లేదా రూ.కోటి వరకు జరిమానా విధిస్తారు. బిల్లును ప్రవేశ పెట్టిన సందర్భంగా అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. ఈస్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమింగ్‌కు ప్రోత్సాహం ఇవ్వాలని కేంద్రం భావిస్తోందన్నారు. ఇందుకోసం ఓ అథారిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ బిల్లుపై చర్చలో పాల్గొనాలని ప్రతిపక్ష సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్ మనీ గేమింగ్‌తో పలు కుటుంబాలు నాశనమయ్యాయని, యువత భవిష్యత్తు దెబ్బతింటోందని స్పీకర్ ఓం బిర్లా వ్యాఖ్యానించారు. చివరకు ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్యే బిల్లుకు మూజువాణి ఓటుతో సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు పోకర్, రమ్మీ ఇతర కార్డు గేములు, ఆన్‌లైన్ లాటరీలు సహా అన్నిరకాల ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ (సట్టా, జువా) కార్యకలాపాలను నిషేధిస్తుంది.

**మళ్లీమళ్లీ పాల్పడితే ఐదేళ్ల జైలు**

ఆన్‌లైన్ నగదు గేములకు సంబంధించిన ప్రకటనల్లో పాలు పంచుకున్నవారికి గరిష్ఠంగా రెండేళ్ల జైలుశిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. వీటి ఆర్థిక లావాదేవీల్లో ప్రమేయం ఉన్నవారికీ గరిష్ఠంగా మూడేళ్ల శిక్ష, రూ.కోటి వరకు జరిమానా వేస్తారు. తరచూ ఈ నేరాలకు పాల్పడేవారికి మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.రెండు కోట్ల వరకూ జరిమానా విధిస్తారు. ఆన్‌లైన్ మనీ గేమ్స్ ఆడేవారిని నేరస్థులుగా కాకుండా.. బాధితులుగా ఈ బిల్లులో పేర్కొన్నారు.

అగ్రశ్రేణి క్రికెట్ క్రీడాకారులు, ప్రముఖ సినీ నటుల ప్రచారంతో డ్రీమ్ 11, గేమ్స్ 24/7, మొబైల్ ప్రీమియర్ లీగ్ వంటి నగదుతో కూడిన ఆన్‌లైన్ గేములకు ప్రాచుర్యం పెరిగింది.

**నిషేధం వద్దు.. నియంత్రణ చాలు**

మరోవైపు ఈ బిల్లు కారణంగా తమ రంగానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్, ఈగేమింగ్ ఫెడరేషన్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫాంటసీ స్పోర్ట్స్ ప్రతినిధులు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. గేమింగ్‌పై నిషేధం విధించేకంటే.. నియంత్రణ ఉంచాలని సూచించింది.

# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

**జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకే**

హైదరాబాద్, ఈ కబురు: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం న్యూఢిల్లీ వెళుతున్నారు. శుక్రవారం కూడా ఢిల్లీలోనే ఉంటున్న సీఎం.. ఓ మీడియా సంస్థ నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ పర్యటనల భాగంగా పలువురు కేంద్ర మంత్రులను కూడా ఆయన కలిసే అవకాశముంది. శుక్రవారం రాత్రి లేదా శనివారం ఉదయం సీఎం రేవంత్ తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు.



# నేడు

## గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం : కొమిరిశెట్టి సాయిబాబా



కొమిరిశెట్టి సాయిబాబా

ఈ-కబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా తెలిపారు. డివిజన్ పరిధిలోని ఖాజాగూడలో గల టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 24వ తేదీన మియాపూర్ లోని నరేన్ గార్డెన్స్ లో శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో, గచ్చిబౌలి డివిజన్ శ్రేణులను సమాయాత్తం చేసేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆత్మీయ సమ్మేళనం సభకు తరలివెళ్లే ప్రక్రియపై చర్చించడంతోపాటు డివిజన్ పరిధిలోని సీనియర్ నాయకులు కార్యకర్తలకు పలు బాధ్యతలు అప్పగించడం జరుగుతుందన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విస్తృతస్థాయి సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

# దేశంలో ఐటీ రంగానికి పునాది వేసిన రాజీవ్ గాంధీ : అనీల్ కుమార్ యాదవ్



రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న అనిల్ కుమార్ యాదవ్

**రాజీవ్ గృహకల్ప లో రాజీవ్ గాంధీ జయంతి**

ఈకబురు, శేరిలింగంపల్లి : భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ హయాంలోనే దేశంలో ఐటీ రంగానికి పునాది పడిందని, ఆయన కృషి కారణంగానే హైదరాబాద్ నగరంలో హైటెక్ సిటీకి బీజం పడిందని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని శేరిలింగంపల్లి డివిజన్ రాజీవ్ గృహకల్ప లో స్థానిక యువత ఆధ్వర్యంలో బుధవారం రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనిల్ కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో యువతరానికి అవకాశాలు కల్పించేందుకు ప్రధానమంత్రిగా రాజీవ్ గాంధీ ముందు చూపుతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకొని రావడంలో రాజీవ్ గాంధీ కృషి ఎనలేనిదని అన్నారు. నేటి యువత రాజీవ్ గాంధీని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సామెల్ కార్తీక్, మహిళా కాంగ్రెస్ నాయకులు జయ, యువజన కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, విద్యార్థి విభాగం నాయకులు, కార్మిక సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

# సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు



రాధాకృష్ణన్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జేడీ(యూ) నేత రాజీవ్ రంజన్ సింగ్ నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. అంతకుముందు పార్లమెంట్ కాంప్లెక్స్‌లోని ప్రేరణ స్థల్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి రాధాకృష్ణన్ నివాళులర్పించారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబరు 9న జరగనుంది.

మొదటి పేజి తరువాయి

# థర్‌డ్‌క్లాస్ సీఎం పెట్టిన అభ్యర్థిని సమర్థించే ప్రసక్తే లేదు!

**థర్‌డ్‌క్లాస్ సీఎం పెట్టిన అభ్యర్థిని సమర్థించే ప్రసక్తే లేదు!**

**ఉపరాష్ట్రపతి ఎన్నికపై ఏ కూటమీ సంప్రదించలేదు**

**యూరియా ఇచ్చిన పార్టీ అభ్యర్థికే మద్దతిస్తాం: కేటీఆర్**

హైదరాబాద్, ఈ కబురు: ఉపరాష్ట్రపతి అభ్యర్థులకు మద్దతు కోరుతూ ఏ కూటమి కూడా తమను సంప్రదించలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. తమది స్వతంత్ర పార్టీ అని.. ఢిల్లీలో బాస్‌లు ఎవరూ లేరని స్పష్టం చేశారు. ఎన్డీయే, ఇండి సహా ఏ కూటమితోనూ తమకు సంబంధం లేదని చెప్పారు. బుధవారమిక్కడ కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'మాకు మోదీ బాస్ కాదు.. రాహుల్ కూడా కాదు.. వారు చెప్పగానే మేం ఓట్లేస్తామా?' అని ప్రశ్నించారు. ఒకవేళ కాంగ్రెస్ తరఫున అభ్యర్థి రేవంత్‌రెడ్డి పెట్టిన వ్యక్తయితే కచ్చితంగా వ్యతిరేకిస్తామని చెప్పారు. కాంగ్రెస్ అనే చిల్లర పార్టీ రాష్ట్ర ప్రజలను ఎంత అరిగోస పెడుతుందో అందరికీ తెలుసన్నారు. అలాంటి థర్డ్ క్లాస్ ముఖ్యమంత్రి, పార్టీ పెట్టిన అభ్యర్థిని సమర్థించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని రేవంత్ మాటలకే పరిమితమయ్యారని, నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బీసీనే ప్రకటించేవారని అన్నారు. ఉపరాష్ట్రపతిగా ఎవరికి మద్దతివ్వాలనేది ఇంకా నిర్ణయించలేదని, సెప్టెంబరు 9లోపు సమావేశమై తమ వైఖరి ప్రకటిస్తామని చెప్పారు. రాష్ట్ర రైతులు యూరియా కోసం అవస్థలు పడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏవైనా సరే.. వచ్చే నెల 9లోపు 2లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి తేవాలని డిమాండ్ చేశారు. ఓటింగ్‌లోపు రాష్ట్రానికి యూరియా తెచ్చిన పార్టీ అభ్యర్థికే ఓటు వేస్తామని ఆయన ప్రకటించారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు కోసం కేసీఆర్‌ను కలుస్తానంటున్న రేవంత్‌రెడ్డి.. ముందు కలవాల్సింది కష్టాల్లో ఉన్న రైతులనని సూచించారు.



# 'స్థానికత' ఆధారంగా ఉద్యోగులకు డిప్యూటేషన్లు!



**రెండు మూడేళ్ల పాటు పంపాలన్న ప్రతిపాదన**

హైదరాబాద్, ఈ కబురు: ఉద్యోగులకు సర్దుబాటు జీవో 317పై ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశమై పలు అంశాలకు సంబంధించి చర్చించింది. బుధవారం సచివాలయంలో కమిటీ చైర్మన్ దామోదర రాజనర్సింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 317 జీఓకు సంబంధించిన ఉద్యోగ సమస్యలపై కమిటీ చర్చించింది. ఈ జీవోకు సంబంధించి ఇప్పటికే పరస్పర బదిలీలు, మెడికల్ గ్రౌండ్ బదిలీలు, భార్యాభర్తల(స్పౌజ్) కేసుల బదిలీలు పూర్తయ్యాయి. అయితే.. ఉద్యోగుల స్థానికతను ఆధారంగా చేసుకుని బదిలీలు చేపట్టాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.ఈ అంశంపై కమిటీ అధికారుల నుంచి వివరాలు కోరింది. ఎలా చేస్తే బాగుంటుందన్న అంశంపై చర్చించింది. స్థానికత ఆధారంగా జిల్లా, జోనల్, మల్టీ జోనల్ ఉద్యోగులను రెండు మూడేళ్ల పాటు డిప్యూటేషన్‌పై పంపితే ఎలా ఉంటుందన్న చర్చ జరిగింది. ఈ ప్రతిపాదనను ఆలోచించాలని అధికారులను కమిటీ ఆదేశించింది. క్లియర్ వెకెన్సీలు ఉన్న చోటనే స్థానికత ఆధారంగా ఉద్యోగులకు డిప్యూటేషన్లు ఇవ్వాలన్న ప్రతిపాదనకు క్యాబినెట్ సబ్ కమిటీ సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈమేరకు అధికారులు కార్యాచరణను చేపట్టాలని, వచ్చే సమావేశం నాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించింది.

# మేజర్ అయిన యువతిని స్టేట్ హోంలో నిర్బంధించలేరు: హైకోర్టు



హైదరాబాద్, ఈ కబురు: మేజర్ అయిన యువతిని ఆమె అభీష్టానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వ హోంలో నిర్బంధించలేరని హైకోర్టు స్పష్టంచేసింది. ఆ యువతి ఇష్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని, కావాలంటే ఆమెను స్వేచ్ఛగా వదిలేయాలని.. అయితే యువతి సంక్షేమాన్ని ప్రతినెలా పరిశీలించాలని యాదాద్రి భువనగిరి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఆదేశాలు జారీచేసింది. స్టేట్‌హోం నుంచి విడుదలైన యువతి ప్రభుత్వ పథకాలు, సహాయం కోసం కోరవచ్చని తెలిపింది. 2018లో బాలికల అక్రమ రవాణా, వ్యభిచారం కేసులో ఓ మహిళపై పోలీసులు కేసు పెట్టారు.ఆమె వద్ద ఉన్న బాలికను స్టేట్‌హోంకు తరలించారు. తర్వాత ఆమహిళపై కేసు వీగిపోయింది. ఇప్పుడామె.. ఆ బాలిక మేజర్ అయిందని.. ఎలాంటి కేసూ పెండింగ్‌లో లేకున్నా యువతిని నిర్బంధించారని హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. యువతి అభీష్టానికి విరుద్ధంగా నిర్బంధించడానికి వీలు లేదని.. ఆమె ఇష్టప్రకారం విడుదల చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖను ఆదేశిస్తూ తీర్పు వెలువరించింది.

**తెలంగాణకు ఐఐఎం కేటాయించండి**

**రాజ్యసభలో కె.లక్ష్మణ్, వద్దిరాజు డిమాండ్**





న్యూఢిల్లీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ను కేటాయించాలని ఎంపీలు కె.లక్ష్మణ్, వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. ఐఐ ఎం సవరణ బిల్లు 2025పై బుధవారం రాజ్యసభలో జరిగిన చర్చలో పాల్గొంటూ వారు ఈ డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో ఐఐఎం ఏర్పాటుకు అన్ని అర్హతలున్నాయని, ప్రజల ఆకాంక్షల మేరకు దీనిని పూర్తిచేయాలని వారు కోరారు. కాగా, కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) ఆధునికీకరణకు కేంద్రం సహకరించాలని ఎంపీ రఘురాం రెడ్డి కోరారు. బుధవారం లోక్‌సభలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. కేటీపీఎస్ 820 మెగావాట్ల విద్యుత్తును అందిస్తోందని తెలిపారు. విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని దీన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునికీకరణకు కేంద్రం సాంకేతిక, ఆర్థికసాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# మద్యం దుకాణాల దరఖాస్తు రూ.3 లక్షలు!



**రాష్ట్రంలో రెండేళ్ల కాలానికి కొత్త మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 2025-27కు గాను దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులను స్వీకరించనుంది.**

**మద్యం దుకాణాల దరఖాస్తు రూ.3 లక్షలు!**
**రాష్ట్రంలో కొత్త దుకాణాల ఏర్పాటుకు సర్కారు అనుమతి**
**దరఖాస్తుల స్వీకరణకు త్వరలో ప్రకటన**
**డిసెంబరు 1 నుంచి కొత్త మద్యం దుకాణాలు**


హైదరాబాద్, ఈ కబురు: రాష్ట్రంలో రెండేళ్ల కాలానికి కొత్త మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 202527కు గాను దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులను స్వీకరించనుంది. ఇందుకోసం త్వరలోనే ప్రకటన విడుదల కానుంది. కొత్త మద్యం దుకాణాల ఏర్పాటుకు ఈ నెల 14న గెజిట్ విడుదలైన నేపథ్యంలో.. దుకాణాల దరఖాస్తు గడువును ఎక్సైజ్ కమిషనర్ నిర్ణయిస్తారు. ఏ4 దుకాణాల దరఖాస్తు రుసుమును సర్కారు ఏకంగా 50 శాతం పెంచింది. గతంలో రూ.2 లక్షలుగా ఉన్న రుసుమును ప్రస్తుతం రూ.3 లక్షలుగా నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న 2620 దుకాణాల గడువు నవంబరు 30తో ముగియనుంది.2025 డిసెంబరు 1 నుంచి కొత్త మద్యం దుకాణాల నిర్వహణ మొదలవుతుంది. 2025 డిసెంబరు 1 నుంచి 2027 నవంబరు 30 వరకు కొత్త దుకాణాల నిర్వహణకు ప్రభుత్వం అనుమతిస్తోంది. దుకాణాల్లో గౌడ్‌లకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం చొప్పున కేటాయించనున్నారు. అనుమతి పొందిన వారు వార్షిక రుసుముతోపాటు అదనంగా రూ.5 లక్షలు చెల్లిస్తే వాకిన్ లిక్కర్ స్టోర్ ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. జీహెచ్ఎంసీ పరిధిలో మద్యం దుకాణాల నిర్వహణ వేళలు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు, జిల్లాల్లో ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటాయి.

**2011 జనాభా లెక్కల ప్రకారం దుకాణాల ఫీజుల వివరాలు**

| జనాభా | దుకాణం ఫీజు(రూ.లక్షల్లో) |
|---|---|
| 5 వేలు | 50 |
| 5-50 వేలు | 55 |
| 50 వేల నుంచి లక్షలోపు | 60 |
| 1-5 లక్షలు | 65 |
| 5-20 | 85 |
| 20 లక్షల పైన | 1.10 కోట్లు |

అనుమతి పొందిన వారు వార్షిక రుసుముతోపాటు అదనంగా రూ.5 లక్షలు చెల్లిస్తే వాకిన్ లిక్కర్ స్టోర్ ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. జీహెచ్ఎంసీ పరిధిలో మద్యం దుకాణాల నిర్వహణ వేళలు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు, జిల్లాల్లో ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటాయి.

# శాసన సభకు పోటీ చేయడానికి 21 ఏళ్ల వయో పరిమితి చాలు



**రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమంలో సీఎం రేవంత్**

**రాజీవ్ కాలంలోనే ఆధునిక భారతానికి పునాది : భట్టి**

హైదరాబాద్,ఈ కబురు: శాసనసభకు పోటీ చేసే అభ్యర్థుల వయస్సును 21 ఏళ్లుగా నిర్ణయిస్తే సరిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఓటు హక్కు పొందడానికి 21 ఏళ్లు నిండాలన్న నిబంధన ఉన్నప్పుడు ఎన్నికల్లో పోటీకి కనీస వయో పరిమితిని 25 ఏళ్లుగా నిర్ణయించారని తెలిపారు. ఆ తర్వాత ఓటు హక్కు పొందడానికి ఉండాల్సిన వయసును మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 18 ఏళ్లకు తగ్గించారని చెప్పారు. పార్లమెంటుకు పోటీకి 25 ఏళ్లు నిండాలన్న నిబంధన ఉన్నా.. శాసనసభకు పోటీ చేయడానికి నిండాల్సిన వయసును 21 ఏళ్లకు తగ్గించాలని అభిప్రాయపడ్డారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి బుధవారం పుష్పాంజలి ఘటించిన అనంతరం రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. 21 ఏళ్లు నిండిన వారు శాసనసభలో ఉంటే దేశానికి ఎంతో మేలు జరుగుతుందని రేవంత్ ఈ సందర్భంగా అన్నారు. ఇందుకోసం తెలంగాణ శాసనసభ ప్రయత్నిస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యాక ఈ మేరకు శాసనసభలో తీర్మానం చేస్తామని ప్రకటించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశ సమగ్రత కాపాడేందుకు ప్రాణాలర్పించిన రాజీవ్ గాంధీ దేశ యువతకు స్ఫూర్తి ప్రదాత అని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లకు పునాది వేసింది, దేశానికి కంప్యూటర్ పరిచయం చేసింది, టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది రాజీవ్‌గాంధీనేనని సీఎం ఈ సందర్భంగా అన్నారు. కాగా, రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలోని వీర్ భూమిలో రాజీవ్‌గాంధీ సమాధి వద్ద రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ ఆధునిక భారతానికి పునాదులు వేశారని గుర్తు చేసుకున్నారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రఘురాం రెడ్డి, కడియం కావ్య, సురేశ్ షెట్కర్, గడ్డం వంశీకృష్ణ రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారుయి.

# అమెరికా భాగస్వామ్యం భారత్‌కు ఎందుకు ముఖ్యం?: హర్ష్ గోయెంకా చెప్పిన 7 అంశాలివే!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్ పట్ల అనుసరిస్తున్న వైఖరి ఇరు దేశాల మధ్య బలమైన సంబంధాలను దెబ్బతీసేలా ఉందని ఇరుదేశాల రాజకీయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామన్న ఆక్రోశంతో ఇటీవల మన దేశంపై మరో 25శాతం అదనపు సుంకాలు విధించడం తీవ్ర చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. అయితే, అమెరికా భారత్ ఎగుమతులపై సుంకాలు విధించవచ్చేమో గానీ, దేశ సార్వభౌమత్వంపై కాదంటూ ఆ సమయంలో ట్వీట్ చేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్‌పీజీ గ్రూపు ఛైర్మన్ హర్ష్ గోయెంకా తాజాగా ఇరు దేశాల సంబంధాలపై స్పందించారు. అమెరికా భాగస్వామ్యం భారత్‌కు ఎందుకు ముఖ్యమో వివరిస్తూ ఆయన 'ఎక్స్'లో షేర్ చేసిన ఏడు అంశాలివే..



**ఇప్పటికీ అమెరికా ఏకైక సూపర్ పవర్. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, బలమైన మిలటరీ వ్యవస్థతో ప్రపంచాన్ని ప్రభావితం చేసే అగ్రరాజ్యం.**

**భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి చైనా కాదు.. అమెరికానే.**

అమెరికాతో వ్యాపారం ద్వారా భారత్‌కు 40 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులు ఉండగా.. చైనాతో మాత్రం 100 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఉండటం గమనార్హం. అమెరికాతో భారత్‌కు రక్షణ, సాంకేతికత, ఆవిష్కరణలు తదితర రంగాల్లో వ్యూహాత్మక ప్రయోజనాలున్నాయి. కార్గిల్ యుద్ధం వంటి సంక్షోభ సమయంలో అమెరికా మనకు మద్దతుగా నిలిచింది. కరవు వంటి సంక్షోభాల సమయంలో ఆహారాన్ని సరఫరా చేసింది. చైనా, రష్యా లేదా మరే ఇతర దేశాన్నీ మనం దీర్ఘకాలిక భాగస్వామిగా విశ్వసించలేం.

అమెరికాతో స్నేహ బంధం పెంపొందించుకోవడం భారత్ పురోగమనానికే కాకుండా భద్రత, ప్రపంచ స్థాయి గుర్తింపునకు దోహదపడుతుంది.

మరోవైపు, అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి ఆ దేశంలో పర్యటించనున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. సెప్టెంబరులో న్యూయార్క్ వేదికగా జరగనున్న ఐక్యరాజ్య సమితి 80వ సమావేశాలకు మోదీ హాజరు కానున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. సెప్టెంబరు 9న ఈ సమావేశాలు ప్రారంభం కానుండగా.. 2329 మధ్య ఉన్నతస్థాయి చర్చలు జరగనున్నాయి. 26న భారత 'ప్రభుత్వ అధిపతి' సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారని ఐరాస తాత్కాలిక వక్తల జాబితా పేర్కొంది. అయితే ఈ విషయమై ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ భేటీ అయ్యే అవకాశాలు కనబడుతున్నాయని సదరు వర్గాలు పేర్కొన్నాయి.



# ఐదో రోజూ అదే జోరు

**ఐటీ, ఎఫ్‌ఎంసీజీ షేర్లకు డిమాండ్**
**మళ్లీ 25,000 స్థాయిపైకి నిఫ్టీ**
**సెన్సెక్స్ 213 పాయింట్లు ప్లస్**

ముంబై: ఐటీ, ఎఫ్‌ఎంసీజీ షేర్లకు డిమాండ్ లభించడంతో స్టాక్ సూచీలు ఐదో రోజూ లాభపడ్డాయి. సెన్సెక్స్ 213 పాయింట్లు పెరిగి 81,858 వద్ద నిలిచింది. నిఫ్టీ 70 పాయింట్లు బలపడి 25,051 వద్ద స్థిరపడింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో లాభాల్లో ట్రేడయ్యాయి. సెన్సెక్స్ 341 పాయింట్లు పెరిగి 81,985 వద్ద, నిఫ్టీ 107 పాయింట్లు బలపడి 25,089 వద్ద ఇంట్రాడే గరిష్ఠాలు అందుకున్నాయి.

☐ రంగాల వారీగా బీఎస్ఈ ఇండెక్సుల్లో ఐటీ 3%, టెక్ 2.22%, ఎఫ్‌ఎంసీజీ 1.36%, రియల్టి, టెలికమ్యూనికేషన్ 0.68% రాణించాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.39%, 0.30% పెరిగాయి. బ్యాంకులు, చమురు, ఫైనాన్స్ సర్వీసెస్, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడికిలోనయ్యాయి.

☐ ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీల షేర్లు డీలాపడ్డాయి. రియల్ మనీ గేమింగ్ వ్యాపారంతో ప్రత్యక్ష సంబంధం లేదంటూ కంపెనీ వివరణ ఇచ్చినప్పటికీ.., నజరా టెక్నాలజీస్ షేరు 13% పతనమై రూ.1,222 వద్ద స్థిరపడింది. ఆన్‌మొబైల్ గ్లోబల్స్ షేరు 3.53% నష్టపోయి రూ.53.27 వద్ద నిలిచింది.

☐రీగల్ రిసోర్సెస్ షేరు లిస్టింగ్ రోజే భారీ లాభాలు పంచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.102)తో పోలిస్తే 39% ప్రీమియంతో రూ.142 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 43% ఎగసి రూ.146 వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 29% లాభంతో రూ.132 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,352కోట్లుగా నమోదైంది.

# బోనస్ వస్తుందోచ్.. ఇన్ఫీ ఉద్యోగులకు శుభవార్త

**దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తమ ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రథమ త్రైమాసికానికి (Q1 FY2025-26) సంబంధించిన పనితీరు బోనస్ లెటర్లను జారీ చేసింది. ఈ త్రైమాసికంలో కంపెనీ ఆర్థిక పనితీరు బలంగా ఉండటంతో ఉద్యోగులకు కూడా మెరుగైన బోనస్‌ను ప్రకటించింది.**




202526 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి సంబంధించి ఉద్యోగులకు సగటున 80% పనితీరు బోనస్ ప్రకటించినట్లుగా తెలుస్తోంది. గత త్రైమాసికంలో ఇచ్చిన 65% సగటు బోనస్ చెల్లింపుతో పోలిస్తే ఇది గణనీయమైన వృద్ధి. దీంతో ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రకటించిన ఈ బోనస్ ఆగస్టు నెల జీతంతో పాటు ఉద్యోగులకు అందనుంది.

ఉద్యోగులు తమ పనితీరు రేటింగ్ ఆధారంగా 75% నుండి 89%వరకు బోనస్ పొందారు. ఈ బోనస్ చెల్లింపు లెవెల్ 4, 5, 6 స్థాయిల్లో ఉన్న (సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, టీమ్ లీడర్లు, సీనియర్ మేనేజర్లు) 3.23 లక్షల మందికి పైగా ఉద్యోగులను కవర్ చేస్తుంది. పనితీరు విషయంలో ఉద్యోగులను మూడు కేటగిరీలుగా వర్గీకరించి బోనస్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇన్ఫోసిస్ 202526 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి బలమైన ఆర్థిక ఫలితాలు సాధించింది. రూ.6,921 కోట్ల నికర లాభం (వార్షిక ప్రాతిపదికన 8.7% వృద్ధి), రూ.42,279 కోట్ల ఆదాయం (వార్షిక ప్రాతిపదికన 7.5% వృద్ధి) నమోదు చేసి, విశ్లేషకుల అంచనాలను అధిగమించింది.

# సేమ్ షాక్: ఎయిర్‌టెల్‌లోనూ ఆ ప్లాన్ కనుమరుగు

**టెలికాం సర్వీస్ ప్రొవైడర్ భారతీ ఎయిర్‌టెల్ తన ఎంట్రీ సెగ్మెంట్ ప్రీపెయిడ్ ప్లాన్‌ను నిలిపివేసింది. ప్రత్యర్థి సంస్థ జియో కూడా రూ.249 ధర గల ఎంట్రీ లెవల్ ప్లాన్ ను నిలిపివేసింది. ఎక్కువ మంది రీచార్జ్ చేసుకునే ఈ ప్లాన్ ను ఎయిర్‌టెల్ నిశ్శబ్దంగా కనుమరుగు చేసింది. ఇప్పుడు వారు రూ .299 ధర గల ఖరీదైన ప్రీపెయిడ్ ప్లాన్ ను ఎంచుకోవలసి వచ్చింది.**

**ఎయిర్ టెల్ నిలిపివేసిన ఈ ప్లాన్ ధర రూ.249. ఇది 28 రోజుల పాటు రోజుకు 1 జీబీ డేటా, అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్ లను అందించేది. ముఖ్యంగా, ఇది వినియోగదారులకు ఉచిత హలోట్యూన్స్, ప్రో ఏఐ, ఎక్స్‌ట్రీమ్ ప్లే వంటి ప్రయోజనాలను కల్పించేది. 28 రోజుల పాటు రోజుకు 1 జీబీ డేటాను అందించే రూ.249 ప్లాన్ ను జియో కూడా ఇటీవల తొలగించింది. జియోలో ఇకపై 1 జీబీ రోజువారీ డేటా లిమిట్‌తో ఎలాంటి ప్లాన్ లేదు. చౌకైన 28 రోజుల ప్లాన్ ఇప్పుడు రూ .299 నుండి ప్రారంభమవుతుంది. ఇది రోజుకు 1.5 జిబి డేటాను అందిస్తుంది.**

**ఈ చర్య ఎయిర్‌ల్, జియోలకు సగటు వినియోగదారుడి ఆదాయాన్ని (ఏఆర్‌పీయూ) పెంచుతుండగా, సామాన్యులపై ఖరీదైన ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్‌ల భారం పడుతోంది. ఈ రెండు టెలికాం ఆపరేటర్లు తీసుకున్న నిర్ణయాన్ని మరో ప్రైవేట్ టెలికం కంపెనీ వొడాఫోన్ ఐడియా కూడా అనుసరించే అవకాశం ఉంది.**






# టాప్ కంపెనీలో 2,800 ఉద్యోగాలు కట్

కృత్రిమ మేధ (ఏఐ) మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులను వేగవంతం చేయడానికి ఉద్దేశించిన పునర్నిర్మాణ వ్యూహంలో భాగంగా ఒరాకిల్ కార్పొరేషన్ భారతదేశంలోని శ్రామిక శక్తిని తగ్గిస్తుంది. దేశంలోని కంపెనీ ఉద్యోగుల్లో దాదాపు 10% మందిని తొలగించాలని నిర్ణయించింది. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, ముంబై, పుణె, నోయిడా, కోల్‌కతా వంటి కీలక ప్రాంత్రాల్లో సుమారు 28,824 మంది ఉద్యోగులు ఒరాకిల్‌లో పని చేస్తున్నారు. వీరిపై ప్రభావంపడే అవకాశం ఉంది.

కంపెనీ ప్రకటించిన లేఆఫ్స్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, క్లౌడ్ సేవలు, కస్టమర్ బేస్‌పై నిమగ్నమైన బృందాలను తీవ్రంగా దెబ్బతీస్తాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. కొన్ని క్యాంపస్‌ల్లో ఈ తొలగింపులు ఆకస్మికంగా ఉన్నాయని, తొలగింపు ప్యాకేజీలు లేదా అంతర్గత పునర్విభజన ఎంపికల ఊసే లేదని చెబుతున్నారు. యాజమాన్యం నుంచి ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండానే ఊహించని విధంగా నోటీసులు రావడంతో ఆందోళన చెందుతున్నారు. పునర్నిర్మాణ వ్యూహంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఒరాకిల్ ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. గత నెలలో అమెరికాలో 4.5 గిగావాట్ల డేటా సెంటర్ పవర్ కోసం ఓపెన్‌ఏఐ ఒరాకిల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఒరాకిల్ డేటా సెంటర్ల నుంచి భారీ మొత్తంలో కంప్యూటింగ్ పవర్‌ను అద్దెకు తీసుకునేందుకు ఓపెన్‌ఏఐ అంగీకరించింది. తర్వాత ఒరాకిల్ స్టాక్ ఆల్‌టైమ్ గరిష్ఠానికి దగ్గరగా చేరింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మౌలిక సదుపాయాల్లో 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టడానికి ఒరాకిల్ సాఫ్ట్‌బ్యాంక్ గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ లేఆఫ్స్ తరుణంలో ఉద్యోగులు తమ నైపుణ్యాలు మెరుగుపరుచుకుని, మెరుగైన పనితీరు కనబరచాలని నిపుణులు చెబుతున్నారు. భవిష్యత్తు ఏఐపై ఆధారపడబోతోందని స్పష్టమైన సంకేతాలు వస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన స్కిల్స్‌పై ఎక్కువ దృష్టి సారించాలని చెబుతున్నారు.

# జీఎస్‌టీ తగ్గింపుతో వినియోగం జోరు

**ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక**

వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)లో రెండే పన్ను శ్లాబులతో కూడిన ప్రతిపాదిత సంస్కరణలతో ఆదాయ నష్టం ఏర్పడినప్పటికీ.. అంతిమంగా వినియోగానికి, జీడీపీకి ఊతమిస్తుందని ఎస్‌బీఐ రీసెర్చ్ విభాగం అంచనా వేసింది. జీఎస్‌టీ 5, 12, 18, 28 శాతం శ్లాబులు ఉండగా.. 5, 18 శాతంతో పాటు లగ్జరీ, సిన్ (పొగాకు తదితర) గూడ్స్‌పై 40 శాతం పన్నును కేంద్ర ఆర్థిక శాఖ ప్రతిపాదించింది. దీనిపై మంత్రుల బృందం అధ్యయనం తర్వాత తుది నిర్ణయం తీసుకోనున్నారు. రేట్ల తగ్గింపు ఫలితంగా ఆదాయం రూ.85,000 కోట్లు తగ్గుతుందని, అదే సమయంలో వినియోగం రూ.1.98 లక్షల కోట్లు పెరుగుతుందని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక అంచనా వేసింది.



జీడీపీ కూడా 0.6 శాతం పెరుగుతుందని నివేదిక పేర్కొంది. జీఎస్‌టీ ఆరంభంలో సగటు రేటు 14.4 శాతంగా ఉంటే, 2019 సెప్టెంబర్ నాటికి 11.6 శాతానికి తగ్గిందని.. అది ఇప్పుడు 9.5 శాతానికి దిగిరావచ్చని తెలిపింది. వినియోగం పెరుగుతుండడం ద్రవ్యోల్బణాన్ని ఎగిసేలా చేయదని వివరించింది. నిత్యావసరాలైన ఆహారం, వస్త్రాలపై 12 శాతం రేటు కాస్తా 5 శాతానికి దిగొస్తుందని.. ఈ విభాగంలో రిటైల్ ద్రవ్యోల్బణం 10-15 బేసిస్ పాయింట్లు తగ్గుతుందని తెలిపింది. సేవలకు సంబంధించి ద్రవ్యోల్బణం 5-10 బేసిస్ పాయింట్లు తగ్గుతుందని అంచనా కట్టింది. దీంతో మొత్తం మీద రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) 0.20-0.25 శాతం తగ్గుతుందని తెలిపింది.

**జీడీపీ 1.6 శాతం పెరగొచ్చు..**

బడ్జెట్‌లో కల్పించిన ఆదాయపన్ను ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకుని చూస్తే మొత్తం మీద వినియోగం 5.31 లక్షల కోట్లు పెరుగుతుందని.. దీని ఫలితంగా జీడీపీ వృద్ధి 1.6 శాతం అధికమవుతుందని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక తెలిపింది.







# మోక్షజ్ఞ 'లవ్ స్టోరీ' కోసం ఎదురుచూస్తున్నాడు: నారా రోహిత్

**ప్రస్తుతం నందమూరి అభిమానులతో పాటు సినీ ప్రియులంతా మోక్షజ్ఞ ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా మోక్షజ్ఞ లుక్ కూడా ఒకటి సోషల్ మీడియాలో వైరలైన విషయం తెలిసిందే. దీనిపై నటుడు నారా రోహిత్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇండస్ట్రీకి వచ్చేందుకు ఈ నందమూరి వారసుడు చాలా ఆసక్తిగా ఉన్నాడని తెలిపారు.**

''ఇటీవల మోక్షజ్ఞతో మాట్లాడినప్పుడు కూడా స్క్రిప్ట్ కోసం చూస్తున్నట్లు చెప్పాడు. ఈ ఏడాది చివర్లో, లేదంటే వచ్చే సంవత్సరం ప్రారంభంలో అతని ఎంట్రీ ఉండే అవకాశం ఉంది. ఇండస్ట్రీకి రావడం కోసం అతడు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాడు. సినిమాల కోసమే లుక్ మార్చుకున్నాడు. గతంలో లుక్ కంటే ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ కోసం వెతుకుతున్నట్లు ఈ మధ్య కలిసినప్పుడు చెప్పాడు . అలాంటి కథ ఉంటే ఈ ఏడాదిలోనే ఎంట్రీ ఉండే అవకాశం ఉంది'' అని నారా రోహిత్ తెలిపారు.

బాలకృష్ణతో తన మల్టీ స్టారర్‌పై నారా రోహిత్ స్పందించారు. గతంలో స్క్రిప్ట్ రెడీ చేసినట్లు చెప్పారు. ''కథ రెడీ చేశారు. మా ఇద్దరికీ లుక్ టెస్ట్ కూడా చేశారు. కథ నచ్చింది. కానీ, ఆ సమయంలో ఆయనకు వరుస సినిమాలు, ఎలక్షన్స్ ఉండడంతో అది పట్టాలెక్కలేదు. బాలయ్య నటించిన మరో సినిమాలోనూ నేను అతిథి పాత్రలో చేయాల్సిఉంది. కానీ, అది కూడా కొన్ని కారణాల వల్ల కుదర్లేదు. ఆ సినిమా స్థానంలోనే ఆయన 'లెజెండ్' చేశారు. భవిష్యత్తులో బాలయ్యతో కలిసి నటించే అవకాశం వస్తే కచ్చితంగా చేస్తాను. ఆ రోజు కోసమే ఎదురుచూస్తున్నా'' అని నారా రోహిత్ చెప్పారు. తన రాజకీయ రంగ ప్రవేశం గురించి మాట్లాడుతూ.. తాను సమయం వచ్చినప్పుడల్లా కార్యకర్తలను కలుస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు మంచి చేయడం కోసం తానెప్పుడూ సిద్ధమేనన్నారు.

ప్రస్తుతం నారా రోహిత్ నటించిన 'సుందరకాండ' విడుదలకు సిద్ధంగా ఉంది. ఆయన కథానాయకుడిగా కొత్త దర్శకుడు వెంకటేశ్ నిమ్మలపూడి తెరకెక్కించిన చిత్రమిది. శ్రీదేవి విజయ్‌కుమార్, వృతి వాఘని కథానాయికలు. ఈనెల 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. హీరో పెళ్లి కష్టాలు ప్రధానంగా తీర్చిదిద్దిన ఆ వీడియో నవ్వులు పూయించింది. హీరో పరిస్థితిని వివరించేలా సాగిన ర్యాప్ సాంగ్ కూడా అలరించింది.



# అది సవాలే కానీ...: కోలీవుడ్‌లో ఎంట్రీపై నోరా ఫతేహి

నోరా ఫతేహి కోలీవుడ్ ఎంట్రీపై కొంతకాలంగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. 'కాంచన 4' లో ఆమె నటించే అవకాశాలున్నాయంటూ రూమర్స్ వచ్చాయి. నోరా వాటికి తాజాగా చెక్ పెట్టింది. ఆ సినిమాలో తాను నటిస్తున్నట్టు ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. బాలీవుడ్, కోలీవుడ్‌లపై తన అభిప్రాయం వ్యక్తం చేసింది. 'కాంచన 4' గురించి మాట్లాడుతూ.. "ఈ సినిమా ఆఫర్ వచ్చిన సమయంలో.. కోలీవుడ్‌కు పరిచయం కావడానికి ఇదే సరైన ప్రాజెక్టు అని అనుకున్నా. స్క్రిప్టు బాగా నచ్చింది. పైగా 'కాంచన' ఫ్రాంచైజీకి ప్రేక్షకుల్లో గొప్ప ఆదరణ ఉంది. 'మడ్‌గావ్ ఎక్స్‌ప్రెస్' తర్వాత అలాంటి జానర్ మూవీ చేయాలనుకున్నప్పుడు 'కాంచన 4' అవకాశం దక్కింది. కొత్త భాషలో నటించడం సవాలే. కానీ, నేను సవాళ్లను ఇష్టపడతా. హిందీ, తెలుగు, మలయాళంలాగే తమిళం నేర్చుకునే ప్రయత్నం చేస్తున్నా. దాని కోసం కొన్ని గంటలు అధికంగా కష్టపడుతున్నా. భాష నేర్పించడంలో చిత్ర బృందం సాయం చేస్తోంది" అని నోరా తెలిపింది.

# పదిహేను కోట్ల ఇంట్లో...



'దేవర' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత ఎన్టీఆర్ సోలో హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్టీఆర్ నీల్' (వర్కింగ్ టైటిల్). 'కేజీఎఫ్, సలార్' వంటి హిట్ చిత్రాల తర్వాత డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కల్యాణ్‌రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి 'డ్రాగన్' అనే టైటిల్ పరిశీలనలో ఉందని ఫిల్మ్‌నగర్ టాక్. ఇదిలా ఉంటే... ఈ చిత్రానికి సంబంధించిన ప్రతిదీ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారుతోంది.

ఇప్పటికే మూడువేల మంది జూనియర్ ఆర్టిస్టులతో చిత్రీకరించిన ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్, అలాగే సుమారు 2000 మందితో తెరకెక్కించిన ఓ పాట... ఇలా అన్నీ హైలెట్‌గా మారాయి. తాజాగా ఈ చిత్రం కోసం హైదరాబాద్ సమీపంలోని ఓ స్టూడియోలో సుమారు పదిహేను కోట్ల రూపాయలతో ఎన్టీఆర్ ఇంటి సెట్‌ని నిర్మించారనే వార్తలు వస్తున్నాయి. ఈ భారీ సెట్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తో కొత్త షెడ్యూల్‌ని ప్రారంభిస్తారట.

సినిమాలో ఈ ఇంటి సెట్ ప్రధాన ఆకర్షణల్లో ఒకటిగా నిలుస్తుందట. కళాఖండాలు, వాల్ హ్యాంగింగ్... ఇలా ఈ సెట్‌కి సంబంధించిన ప్రతి విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నారట మేకర్స్. అందుకే సెట్‌కే దాదాపు రూ. 15 కోట్లు ఖర్చు చేశారని సమాచారం. ప్రస్తుతం షూటింగ్‌కి చిన్న విరామం ఇచ్చిన ఎన్టీఆర్ వినాయక చవితి తర్వాత సెప్టెంబర్ మొదటి వారం నుంచి షూటింగ్‌లో పాల్గొంటారని టాక్. ఈ కొత్త షెడ్యూల్ నెల పాటు జరగనుందని తెలి సింది. ఈ చిత్రం 2026 జూన్ 25న విడుదల కానుంది.



# పెద్ద డైరెక్టర్ పీరియాడిక్ మూవీ ఈ మధ్యే రిలీజ్.. ఫస్ట్ నన్నే సెలక్ట్ చేశారు.. కానీ!

చాలా సినిమాలు వచ్చినట్లే వచ్చి చేజారిపోయాయంటోంది నటి దీక్షా పంత్ . ఇటీవల వచ్చిన ఓ పెద్ద మూవీలో కూడా తాను నటించాల్సిందని, కానీ చెప్పాపెట్టకుండా సైడ్ చేశారని వాపోయింది. ఇలా తన కెరీర్ జర్నీ గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో అనేక విషయాలను పంచుకుంది. దీక్షా పంత్ మాట్లాడుతూ.. మాది ఉత్తరాఖండ్. నాన్న రైల్వే ఉద్యోగి కావడంతో ఎప్పుడూ ట్రాన్స్‌ఫర్స్ అవుతుండేవి. అలా నేను పుట్టింది విజయవాడలో, పెరిగింది కాకినాడలో!

**మొదట నో చెప్పా..**

ఎయిర్ హోస్టెస్ అవ్వాలనుకున్నాను. ట్రైనింగ్ కూడా తీసుకున్నాను. ఓ ఈవెంట్‌లో కొరియోగ్రాఫర్ నన్ను చూసి మోడలింగ్ ట్రై చేయొచ్చుగా అని చెప్పారు. మా ఇంట్లో చంపేస్తారంటూ నో చెప్పాను. రెండేళ్ల తర్వాత అతడే మళ్లీ కాల్ చేసి అడిగాడు. ఇంతలా అడుగుతున్నాడని ఒకసారి ట్రై చేద్దామని చేశాను. ఇంట్లో ఒప్పించి ఫోటోషూట్, ర్యాంప్ షోస్ చేశాను. అలా మోడలింగ్‌లో బిజీ అయ్యాను. తర్వాత సినిమాల్లోకి వచ్చాను.

**పెద్ద మూవీలో ఆఫర్**

మొదట్లో అవకాశాలిస్తాం కానీ మాకు మరేదో కావాలని అడిగేవారు. నేను ముఖం మీదే నో చెప్పేదాన్ని. నన్ను రిజెక్ట్ చేసేవారు. అవకాశాల కోసం మరీ అందరితో రాసుకుపూసుకు తిరగను. అందుకే సక్సెస్‌ఫుల్ కాలేదు. గతంలో మంచి హిట్స్ ఇచ్చిన ఒక పెద్ద డైరెక్టర్ ఈ మధ్య ఓ పీరియడ్ డ్రామా సినిమా రిలీజ్ చేశారు. 2017లోనే ఈ మూవీ చేయమని ఆఫర్ చేశారు.

**అలా ఎన్నో ఆఫర్స్ మిస్**

అంతా బానే ఉందనుకున్న సమయంలో సడన్‌గా నన్ను వద్దనుకున్నారు. ఆ విషయం నాకు చెప్పనేలేదు. అంత మంచి ప్రాజెక్ట్ వచ్చినట్లే వచ్చి చేజారడం కాస్త బాధేసింది. అలా చాలా ఆఫర్లు వచ్చినట్లే వచ్చి చేతికందకుండా పోయాయి అని చెప్పుకొచ్చింది. రచ్చ, వరుడు, ఒక లైలా కోసం, గోపాల గోపాల చిత్రాల్లో అలరించింది నటి దీక్షా పంత్. మంగమ్మ అనే ప్రైవేట్ సాంగ్‌తో ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. తెలుగు బిగ్‌బాస్ మొదటి సీజన్‌లో పాల్గొని మరింత ఫాలోయింగ్ సంపాదించుకుంది.




# అనుష్క శెట్టి పాన్ ఇండియా మూవీ.. ఆ సాంగ్ వచ్చేసింది!

**అనుష్కశెట్టి లీడ్ రోల్‌లో వస్తోన్న పాన్ ఇండియా చిత్రం ఘాటి. ఈ మూవీకి క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీని యూవీ క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. ఈ సినిమాలో విక్రమ్ ప్రభు కీలక పాత్రలో నటించారు. ఇప్పటికే ట్రైలర్ రిలీజ్ కాగా ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.**

తాజాగా ఈ సినిమా నుంచి దస్సోరా అనే లిరికల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ క్రేజీ సాంగ్‌కు సాగర్ నాగవెల్లి కంపోజ్ చేయగా.. ఈఎస్ మూర్తి లిరిక్స్ అందించారు. ఈ పాటను గీతా మాధురి, సాకేత్, శ్రుతి రంజని ఆలపించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా సెప్టెంబరు 5న థియేటర్లలో సందడి చేయనుంది.



# గుకేశ్‌కు ప్రజ్ఞానంద షాక్

**సెయింట్ లూయిస్ (అమెరికా):** సింక్‌ఫీల్డ్ కప్ గ్రాండ్ చెస్ టూర్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ సంచలన ఫలితంతో శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో ప్రజ్ఞానంద 36 ఎత్తుల్లో భారత్‌కే చెందిన క్లాసికల్ ఫార్మాట్ ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్‌ను ఓడించాడు. ఈ ఫలితంతో ప్రజ్ఞానంద ప్రపంచ చెస్ లైవ్ రేటింగ్స్‌లో మూడో స్థానానికి చేరుకోవడం విశేషం.

క్వీన్స్ గాంబిట్ పద్ధతిలో మొదలైన ఈ గేమ్‌లో ప్రజ్ఞానంద ఎత్తులకు సమాధానం ఇచ్చేందుకు గుకేశ్ తీవ్రంగా ఆలోచించాల్సి వచ్చింది. ఒకదశలో సమయాభావంవల్ల గుకేశ్ దీటైన ఎత్తులు వేయలేకపోయాడు. చివరకు 36 ఎత్తులు ముగిశాక గుకేశ్ ఓటమిని అంగీకరించాడు. 10 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య 9 రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది.

మరోవైపు లెవోన్ అరోనియన్ (అమెరికా) 41 ఎత్తుల్లో నొదిర్బెక్ అబ్దుసత్తోరోవ్ (ఉజ్బెకిస్తాన్)పై గెలుపొందగా... సో వెస్లీ (అమెరికా)-సామ్ సెవియాన్ (అమెరికా) మధ్య గేమ్ 56 ఎత్తుల్లో... అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్)-మాక్సిమి లాగ్రెవ్ (ఫ్రాన్స్) గేమ్ 58 ఎత్తుల్లో... ఫాబియానో కరువానా (అమెరికా)-జాన్ క్రిస్టాఫ్ దూడా (పోలాండ్) గేమ్ 57 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి.



# మను గురికి రెండు కాంస్యాలు

**షిమ్‌కెంట్ (కజకిస్తాన్):** ఆసియా సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో మంగళవారం భారత్‌కు రెండు కాంస్య పతకాలు లభించాయి. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత స్టార్ మనూ భాకర్ వ్యక్తిగత విభాగంతో పాటు టీమ్ విభాగంలో కాంస్య పతకాన్ని గెల్చుకుంది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో మను 219.7 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని దక్కించుకుంది.

మనూ భాకర్, సురుచి సింగ్, పలక్‌లతో కూడిన భారత జట్టు 1730 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. మను 583 పాయింట్లు, సురుచి 574 పాయింట్లు, పలక్ 573 పాయింట్లు సాధించారు. ఇదే వేదికపై జరుగుతున్న ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో రష్మిక 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించింది. ఫైనల్లో రష్మిక 241.9 పాయింట్లు స్కోరు చేసింది. రష్మిక, వన్షిక, మోహిని సింగ్‌లతో కూడిన భారత జట్టు 1720 పాయింట్లతో పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది.

# తప్పు సరిదిద్దుకున్న ఐసీసీ.. రీఎంట్రీ ఇచ్చిన రోహిత్, కోహ్లి





**ఐసీసీ ఇవాళ (ఆగస్ట్ 20) ప్రకటించిన వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో ఘోర తప్పిదం జరిగింది. గత వారం ర్యాంకింగ్స్‌లో రెండు, నాలుగు స్థానాల్లో ఉండిన టీమిండియా దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి.. తాజా ర్యాంకింగ్స్‌లో టాప్-100లో కూడా కనబడలేదు. ఈ ఇద్దరి పేర్లు ఆకస్మికంగా మాయం కావడంపై సోషల్‌మీడియాలో భారీ ఎత్తున డిస్కషన్స్ నడుస్తుండగా ఐసీసీ స్పందించింది.**

సాంకేతిక లోపం కారణంగా రోహిత్, కోహ్లి పేర్లు ర్యాంకింగ్స్‌లో కనబడలేదని వివరణ ఇచ్చింది. తప్పును సరి దిద్దుకుంటూ వారిద్దరి పేర్లను తిరిగి ర్యాంకింగ్స్ జాబితాలో చేర్చింది. అప్‌డేట్ చేసిన తర్వాత రోహిత్, కోహ్లి తమ పాత ర్యాంకులైన రెండు, నాలుగు స్థానాలను తిరిగి దక్కించుకున్నారు.

రోహిత్, కోహ్లి వన్డే ర్యాంకింగ్స్‌లోకి రీఎంట్రీ ఇవ్వడంతో వారి అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. తొలుత ర్యాంకింగ్స్‌లో కనపడకపోయే సరికి రోహిత్, కోహ్లి వన్డేలకు కూడా రిటైర్మెంట్ ప్రకటించారని ప్రచారం జరిగింది. అయితే సాంకేతిక లోపం కారణంగా తప్పిదం జరిగిందని తెలిసి రోహిత్, కోహ్లి అభిమానుల మనసులు కుదుటపడ్డాయి.

కాగా, సాంకేతిక లోపం కారణంగా తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో మరిన్ని తప్పిదాలు దొర్లాయి. రోహిత్, కోహ్లి పేర్లు మాయమైపోవడంతో పాటు పలువురు రిటైరైన ఆటగాళ్ల పేర్లు జాబితాలో ప్రత్యక్షమయ్యాయి. ఇందులో సౌతాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్, స్టీవ్ టికోలో, అలెక్స్ ఓబంద, థామస్ ఒడోయో, అన్షీ రథ్ లాంటి పేర్లు ఉన్నాయి. తప్పిదాన్ని గుర్తించిన తర్వాత ఐసీసీ వీరి పేర్లను తొలగించింది.

సవరించిన వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా ఆటగాడు శుభ్‌మన్ గిల్ అగ్రస్థానంలో ఉండగా.. రోహిత్ శర్మ, బాబర్ ఆజమ్, విరాట్ కోహ్లి, డారిల్ మిచెల్, చరిత్ అసలంక, హ్యారీ టెక్టార్, శ్రేయస్ అయ్యర్, ఇబ్రహీం జద్రాన్, కుసాల్ మెండిస్ టాప్ 10లో ఉన్నారు.

# తొలి వన్డేలో ఆసీస్‌పై విజయం.. సౌతాఫ్రికా ఆటగాడిపై ఫిర్యాదు

**తొలి వన్డేలో ఆస్ట్రేలియాపై అద్భుత విజయం సాధించి జోష్‌లో ఉన్న సౌతాఫ్రికాకు ఊహించని షాక్ తగిలింది. ఆ జట్టు అరంగేట్రం స్పిన్నర్ ప్రేనేలన్ సుబ్రాయెన్ బౌలింగ్ యాక్షన్‌పై అనుమానాలు వ్యక్తమయ్యాయి. సుబ్రాయెన్ బౌలింగ్ శైలిపై మ్యాచ్ అఫీషియల్స్ ఐసీసీకి ఫిర్యాదు చేశారు.**

**కుడి చేతి వాటం రైట్ ఆర్మ్ ఆఫ్ స్పిన్నర్ అయిన సుబ్రాయెన్ బౌలింగ్ శైలి కాస్త భిన్నంగా ఉంది. అతడి యాక్షన్ ఐసీసీ నియమాలకు విరుద్ధమేమో అని మ్యాచ్ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో సుబ్రాయెన్ ఐసీసీ పర్యవేక్షణలో ఓ పరీక్షను (బౌలింగ్ శైలి) ఎదుర్కోవాల్సి ఉంది.**

సుబ్రాయెన్ ఆసీస్‌తో జరిగిన మ్యాచ్‌లో పర్వాలేదనిపించాడు. తన కోటా 10 ఓవర్లలో 46 పరుగులిచ్చి అత్యంత కీలకమైన ట్రవిస్ హెడ్ వికెట్ తీశాడు. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా ఆసీస్‌ను 98 పరుగుల తేడాతో చిత్తు చేసింది.

తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 296 పరుగులు చేయగా.. ఛేదనలో చేతులెత్తేసిన ఆస్ట్రేలియా 40.5 ఓవర్లలో 198 పరుగులకే ఆలౌటైంది. సౌతాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ ఐదు వికెట్లు తీసి ఆసీస్ పతనాన్ని శాశించాడు. అతనికి నండ్రే బర్గర్ (2/54), లుంగి ఎంగిడి (2/28), సుబ్రాయెన్ (1/46) తోడయ్యారు.

ఆసీస్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ మిచెల్ మార్ష్ (88) ఒక్కడే రాణించాడు. ట్రవిస్ హెడ్ (27), బెన్ ద్వార్షుయిస్ (33) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. అంతకుముందు మార్క్రమ్ (82), బవుమా (65), బ్రీట్జ్కే (57) అర్ద సెంచరీలతో రాణించడంతో సౌతాఫ్రికా భారీ స్కోర్ చేసింది. ఆసీస్ బౌలర్లలో హెడ్ 4 వికెట్లతో సత్తా చాటాడు.

**గత నెలలోనే టెస్ట్ అరంగేట్రం**


31 ఏళ్ల సుబ్రాయెన్ గత నెలలోనే టెస్ట్ అరంగేట్రం చేశాడు. జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో 4 వికెట్లు (ఒకే ఇన్నింగ్స్‌లో) తీసి పర్వాలేదనిపించాడు. సుబ్రాయెన్ లోయర్ ఆర్డర్‌లో ఉపయోగకరమైన బ్యాటర్ కూడా. అతడికి ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మంచి బ్యాటింగ్ రికార్డు ఉంది.

లేట్‌గా అంతర్జాతీయ క్రికెట్‌లోకి ఎంట్రీ ఇచ్చిన సుబ్రాయెన్ రెండో మ్యాచ్‌తోనే వివాదంలో చిక్కుకున్నాడు. బౌలింగ్ శైలిపై ఐసీసీ క్లీన్ చిట్ ఇస్తేనే అతడు ఆసీస్‌తో రెండో వన్డే ఆడగలడు. రెండో వన్డే ఆగస్ట్ 22న జరుగనుంది.





# స్వియాటెక్ సాధించె... విజేతగా అల్‌కరాజ్.. ఇద్దరూ ఒకే విమానంలో..



**సిన్సినాటి (ఒహాయో): ఎట్టకేలకు ఏడో ప్రయత్నంలో పోలాండ్ టెన్నిస్ స్టార్, ప్రపంచ మూడో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ సిన్సినాటి ఓపెన్ డబ్ల్యూటీఏ–1000 టోర్నీలో తన లక్ష్యాన్ని చేరుకుంది. గతంలో ఆరుసార్లు ఈ టోర్నీలో ఆడిన స్వియాటెక్ సెమీఫైనల్ అడ్డంకిని దాటలేకపోయింది.**

**అయితే ఏడో ప్రయత్నంలో మాత్రం స్వియాటెక్ చాంపియన్‌గా అవతరించింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో స్వియాటెక్ 7–5, 6–4తో ప్రపంచ ఏడో ర్యాంకర్ జాస్మిన్ పావోలిని (ఇటలీ)పై గెలిచింది.**

**1 గంట 49 నిమిషాలపాటు జరిగిన ఈ తుదిపోరులో స్వియాటెక్ తొమ్మిది ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. స్వియాటెక్ కెరీర్‌లో ఇది 24వ సింగిల్స్ టైటిల్‌కాగా... ఈ ఏడాది వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ టైటిల్ తర్వాత రెండోది.**

విజేతగా నిలిచిన స్వియాటెక్‌కు 7,52,275 డాలర్ల (రూ. 6 కోట్ల 54 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు, రన్నరప్ పావోలినికి 3,91,600 డాలర్ల (రూ. 3 కోట్ల 40 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 650 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

**విజేత అల్‌కరాజ్**

సిన్సినాటి ఓపెన్ ఏటీపీ-1000 టోర్నీలో స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ విజేతగా నిలిచాడు. ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ)తో జరిగిన ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ 5-0తో గెలిచాడు. తొలి సెట్‌లో 0-5తో వెనుకబడిన దశలో అనారోగ్యం కారణంగా సినెర్ మ్యాచ్ నుంచి వైదొలిగాడు.

ఇక టైటిల్ నెగ్గిన అల్‌కరాజ్‌కు 11,24,380 డాలర్ల (రూ. 9 కోట్ల 78 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ సినెర్‌కు 5,97,890 డాలర్ల (రూ. 5 కోట్ల 20 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 650 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఓవరాల్‌గా ఈ ఏడాది అల్‌కరాజ్‌కిది ఆరో టైటిల్‌కాగా, కెరీర్‌లో 22వది కావడం విశేషం.

**ఒకే విమానంలో..**

ఇదిలా ఉంటే.. సిన్సినాటి ఓపెనర్ టైటిల్స్ గెలిచిన తర్వాత స్వియాటెక్, అల్‌కరాజ్ కలిసి ఒకే విమానంలో న్యూయార్క్‌కు బయలుదేరారు. యూఎస్ ఓపెన్‌లో విజేతలుగా నిలవడమే లక్ష్యంగా అమెరికాలో అడుగుపెట్టారు. వీరిద్దరు ఒకే విమానంలో ప్రయాణిస్తున్న వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.